www.teluguone.com

# పల్లె పండుగ సంక్రాంతి

అవును... మకర సంక్రాంతి నిజంగా పల్లెవాసుల పండగే. మనమందరం వచ్చింది పల్లెటూళ్లలోనుంచే. కారణాలేమయినా కానీ మనం క్రమంగా గ్రామీణ వాతావరణానికి, మన సంస్కృతికి దూరంగా జరిగిపోతున్నాం, వెళ్ళిపోతున్నాం.

ఇప్పటికీ పల్లెల్లో జరిగే అతి పెద్దపండుగ సంక్రాంతి. సంక్రాంతి జానపదుల పండుగ ఎందుకయిందంటే జనవరి మాసానికి రైతులకు పొలాల్లోని ధాన్యం ఇంటికి వస్తుంది. ఆ ధాన్యాన్ని అమ్మటం ద్వారా రైతులకు కావలసినంత సొమ్ము వుంటుంది. ఈ సమయంలో జనపదాలు ధనలక్ష్మి, ధాన్యలక్ష్ములతో కళకళలాడుతూ వుంటాయి.
ఇది కనిపెట్టే ఈ పండుగకి హరిదాసులు 'హరిలో రంగ హరి' అంటూ బయల్దేరతారు. తెల్లవారు ఝామున అయిదు గంటలకే మసక చీకట్లో, మంచుతెరలను చీల్చుకుంటూ ప్రతి ఇంటిని నిద్ర లేపుతారు. ధాన్యం స్వీకరించిన తరువాత దీవెనలు అందిస్తారు.
హరిదాసు వచ్చి వెళ్ళిన తర్వాత వచ్చేది గంగిరెడ్ల వారు. ఎక్కడెక్కడినుంచో పల్లెటూళ్ళకు వస్తారు.... రంగు రంగుల వస్త్రాలతో, కనువిందు చేసే విధంగా అలంకరించిన బసవన్నలను తెస్తారు. సన్నాయి ఊదుతూ తమ బసవన్నలతో చిన్న చిన్న నృత్యాలు చేయిస్తూ వుంటే పసి పిల్లలకు ఎంతో ఆనందం. తర్వాత గృహస్థులిచ్చే తృణమో, పణమో పుచ్చుకుని పావుగంటసేపు ఆశీర్వచనాలిచ్చి వెళతారు.
ఈ మూడు రోజులు జరిగే కోడి పందేల జోరు గురించి మాటల్లో చెప్పలేం. అయితే ఇప్పుడు ఇవి ఎక్కువ కనబడటం లేదు.
జనవరిలో వుండే వణికించే చలి అంటే ముద్దులొలికే ముద్ద బంతిపువ్వులకు ఎంతో ప్రియం. ఇవేకాకుండా సువాసనలు వెదజల్లే కారబ్బంతులు, అందమైన చేమంతులు తలలూపుతూ సంక్రాంతికి స్వాగతం పలుకుతాయి. అన్ని పువ్వులకూ చలికాలం అంటేనే ఇష్టం కాబోలు. పూలన్నీ ఈ కాలంలోనే ఎక్కువగా పూస్తాయి.
పల్లెల్లో రోజు అంటే తెల్లవారుఝామున నాలుగు గంటలకే మొదలు. అప్పుడు వణుకు పుట్టించే చలిని తట్టుకునేందుకు గడ్డితో చలి మంటలు వేసుకుంటారు. ఆ మంటలనుంచి వెచ్చదనాన్ని పొంది పనీపాటలకు బయల్దేరతారు.
ఈ చలిని ఏమాత్రం లెక్క చేయకుండా అమ్మలక్కలు ముగ్గుల పోటీలు పెట్టుకుంటారు. ఒకరిని మించి మరొకరు అందమైన రంగుల ముగ్గులతో తమ నేర్పును ప్రదర్శిస్తారు. జనవరి ఒకటితో మొదలయ్యే ఈ ముగ్గుల పోటీలో రోజుకొక రకం ముగ్గుతో వాకిలిని అందంగా తీర్చి దిద్దుతారు. ఈ ముగ్గులన్నిటికీ వింత అందాన్నిస్తాయి గొబ్బెమ్మలు. ఈ గొబ్బెమ్మలకు దిష్టి తగలకూడదన్నట్టు వాటి మీద బంతులు, చేమంతులు, కారబ్బంతి పూలతో అలంకరణ చేస్తారు. బహుశా ఇప్పటివారికి గొబ్బెమ్మలు అంటే తెలియకపోవచ్చు. ముగ్గుల పండుకకు రథం ముగ్గు క్లైమాక్స్ అని చెప్పవచ్చు. ప్రతి ఇంటి ముందు వేసిన రథం తాడును పక్కింటి వాళ్లు వేసిన రథం తాడుతో కలుపుతారు. ఈ తాడును ఊరి బయటవరకు తీసుకువెళతారు. దీనివల్ల ఆ ఊరికి శుభం కలుగుతుందని విశ్వాసం.
సంక్రాంతిని మూడురోజుల పాటు వైభవంగా జరుపుకుంటారు.

మొదటిరోజు భోగి - ఆరోజు పాత కలప సామాన్లతో భోగిమంటలు వేసి, అందరూ ఆనందిస్తారు. భోగిమంటలు శుభానికి ప్రతీకలు అని భావిస్తారు. తలంటు పోసుకుని కొత్త వస్త్రాలు ధరిస్తారు. ముద్దులొలికే చిన్నపిల్లలకు భోగిపళ్ళుపోస్తారు. భోగిపళ్ళు అంటే రేగిపళ్లన్నమాట. సాయంత్రం రకరకాల బొమ్మలతో రంగుల కొలువు పెడతారు. అందర్నీ పేరంటానికి

పిలుస్తారు.

రెండోరోజు సంక్రాంతి - ఈ రోజు అసలు పండుగ జరుపుకుంటారు. అందరూ బంధు మిత్రుల ఇళ్లకు వెళ్ళి, తమ ఇళ్ళల్లో వండిన తీపి పదార్ధాలను పంచుతారు.

మూడోరోజు కనుమ - ఈ రోజు రైతులు తమ జీవితంలో ఒక భాగమై, అన్ని సమయాలలో తమకు అండగా నిలుస్తున్న పశువులను చక్కగా అలంకరిస్తారు, పూజిస్తారు. వాటికిష్టమయిన ఆహారాన్ని తినిపిస్తారు. రకరకాల ఎడ్లపందేలను నిర్వహిస్తారు.

సంక్రాంతి పండుగ అంటే అచ్చమైన తెలుగుతనానికి ప్రతీక. హిందూ సంస్కృతి అంటే మతం కాదు అదొక జీవన విధానం అనీ, ఏ ఇతర మతంలో లేని విధంగా హిందూ సంస్కృతిలో పశువులకు కూడా విశిష్ట స్థానం వుంది అని ఈ పండగ వివరిస్తుంది.